



# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం






సంపుటి : 3 | సంచిక : 300 | జూన్ 28 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-





**మన దునియా,కామారెడ్డి జిల్లా:జూన్ 27**

కామారెడ్డి :కామారెడ్డి జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా వరుణుడు కరుణించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో పడ్డారు. రోహిణి, మృగశిర కార్తెలు ముగిసి ఆరుద్ర కార్తె కూడా దాటిపోతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. బి

దీంతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో అనుమానాలు మొదలయ్యాయి.

**మొలకెత్తని పత్తి, మొక్కజొన్న విత్తనాలు..**

జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులు వర్షం కోసం ఎదురుచూస్తూ ముందస్తుగా పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేశారు. ఆశగా దుక్కులు దున్ని విత్తనాలు చల్లినా చినుకు జాడ లేకపోవడంతో నేలలో విత్తనాలు అలాగే ఉండిపోయాయి. భూమిలో తేమ లేక దుక్కులు ఎండిపోయి నెర్రెలు వారుతున్నాయి. దీంతో వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పెట్టుబడి మొత్తం బూడిదలో పోసిన పన్నీరు అవుతుందేమోనని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇతర పంటలపై అనాసక్తి...**

వర్షాలు ఆలస్యమవుతుండడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. తక్కువ నీటితో పండే కంది, మొక్కజొన్న, ఆముదం, జొన్న, పత్తి వంటి పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని చెబుతున్నారు. అయితే ఇప్పటికే పత్తి, మొక్కజొన్నకు

(మిగతా 2వ పేజీలో..)

## ఢిల్లీలో తీవ్ర భూప్రకంపనలు.. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన జనం


**ఢిల్లీ, ఉత్తర భారతదేశంలో శనివారం సాయంత్రం భూప్రకంపనలు**

**ఆఫ్ఘనిస్థాన్‌లో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు వెల్లడి**

**భయంతో ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీసిన ప్రజలు**

దేశ రాజధాని ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం బలమైన భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్లు, కార్యాలయాల నుంచి ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఏం జరుగుతుందో తెలియక జనం ఆందోళన చెందారు.ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన 6.2 తీవ్రత కలిగిన భారీ భూకంపం కారణంగానే ఈ

(మిగతా 2వ పేజీలో..)



## 'సర్'ను సీరియస్ గా తీసుకోండి: కేటీఆర్



**మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్**

**కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్‌కే మెజార్టీ వస్తుందని వెల్లడి**

**రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా**

మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల

(మిగతా 2వ పేజీలో..)

## ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుంది - రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**మన దునియా,హైదరాబాద్:జూన్ 27**

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు.ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,శ్రీధర్ బాబు,వివేక్ వెంకటస్వామి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గార్లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్

(మిగతా 2వ పేజీలో..)



## 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ...

**సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధ తాబేలుతో ప్రధాని మోదీ భేటీ**

**194 ఏళ్ల 'జొనాథన్' నివసిస్తున్న బొటానికల్ గార్డెన్స్‌కు సందర్శన**

**పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కను నాటిన ప్రధాని**

**భారత్-సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన 'జోనాథన్' అనే తాబేలుతో ఆయన భేటీ

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# ‘సర్’ను సీరియస్ గా తీసుకోండి: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతలు వచ్చాయని.. రైతుబంధు పోయి ‘రాహుల్ బంధు’ వచ్చిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి, కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆరోపించారు. మహేశ్వరంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే సబితా ఇంద్రారెడ్డి గెలుపు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమనిపించిందన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నా.. జనం మాత్రం 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను సీరియస్ గా తీసుకోవాలని... అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

# ఢిల్లీలో తీవ్ర భూప్రకంపనలు.. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన జనం

(మొదటి పేజీ తరువాయి)



ప్రకంపనల వచ్చినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 7:04 గంటలకు ఈ భూకంపం సంభవించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ ప్రాంతంలో, భూమికి 215 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.ఈ భూకంప ప్రభావంతో జమ్మూకశ్మీర్, ఢిల్లీ మరియు పరిసర ప్రాంతాల్లో భూమి స్పష్టంగా కంపించింది. బహుళ అంతస్తుల భవనాలు ఊగిపోవడంతో నివాసితులు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. పలుచోట్ల ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో గుమిగూడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలుగుచూశాయి. అయితే, ఈ భూప్రకంపనల వల్ల భారత్‌లో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు స్పష్టం చేశారు.

# 194 ఏళ్ల ‘జోనాథన్’ను కలిసిన ప్రధాని మోదీ...

(మొదటి పేజీ తరువాయి)



అయ్యారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు.సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు.భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుంది - రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా,రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు..ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు.సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు.ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి గారు పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు.దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన ప్రక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ గారు అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన ప్రక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరు...

# కార్తెలు దాటిపోతున్న కానరాని వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు మళ్లీ వేరే పంటలు వేయడానికి జంకుతున్నారు. రెండోసారి విత్తనాలు, ఎరువులు కొనాలంటే పెట్టుబడి రెట్టింపు అవుతుందని, అప్పులు పెరిగిపోతాయని భయపడుతున్నారు. దిగుబడి వస్తుందో లేదోనని అనుమానంతో ప్రత్యామ్నాయ పంటల జోలికి వెళ్లడం లేదు.

జిల్లాలో తగ్గిన వర్షపాతం..

జిల్లాలో వర్షాకాలం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 108 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా, కేవలం 81 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. అంటే సాధారణం కంటే 25% వర్షపాతం తక్కువగా కురిసింది. జూన్ నెలలోనే ఈ లోటు ఏర్పడటంతో ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం పడుతోంది. చెరువులు, కుంటలు, బోర్లలో నీటిమట్టం పడిపోవడంతో వరి నాట్లకు కూడా నీరు అందడం లేదు. భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు బోర్లపై ఆధారపడే పరిస్థితి లేకుండా పోయింది.

జిల్లాలో సాగు చేస్తున్న పంటల వివరాలు..

జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో మొత్తం 5.65 లక్షల ఎకరాలలో వివిధ పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ నిర్దేశించింది. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో 5.65 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ఇందులో ముఖ్యంగా వరి 3.20 లక్షల ఎకరాలు, పప్పు దినుసులు 52,500 ఎకరాలు, మొక్కజొన్న 48,200 ఎకరాలు, పత్తి 46,500 ఎకరాలలో పంటల సాగు కొనసాగుతోంది. వరి సాగు అత్యధికంగా 3.20 లక్షల ఎకరాల్లో చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే వర్షాలు లేక చెరువులు, కుంటలు నిండకపోవడంతో వరి నాట్లు కూడా ఆలస్యమవుతున్నాయి.

వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపులు...

వారం రోజుల్లో వర్షాలు కురిస్తేనే పంటలు దక్కుతాయని, లేకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. రోహిణి, మృగశిర, ఆరుద్ర కార్తెలు దాటిపోయినా చినుకు జాడ లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు వరుణదేవుడి కోసం ఆకాశం వైపు చూస్తూ ప్రార్థనలు చేస్తున్నారు. పెట్టుబడి దండగై అప్పుల పాలవుతామేమోనని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి..

మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి..

ఈ పరిస్థితులపై జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. “వర్షపాతం సాధారణం కంటే 27 మి.మీ. తక్కువగా నమోదైంది. ఈ నేపథ్యంలో రైతులు అధిక పెట్టుబడి, అధిక నీరు అవసరమయ్యే పంటలకు దూరంగా ఉండాలి. ఇప్పటికే విత్తిన చోట మొలకెత్తకపోతే మళ్లీ అవే పంటలు వేయకుండా, తక్కువ వ్యవధిలో, తక్కువ నీటితో వచ్చే కంది, జొన్న, ఆముదం, కొర్ర వంటి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి. జిల్లాలో సూక్ష్మ సేద్య పరికరాలు ఉన్న రైతులు వాటిని వినియోగించుకోవాలి. వ్యవసాయ శాఖ రైతులకు అన్ని విధాలా సహకరిస్తుంది. అనవసరంగా పెట్టుబడి పెంచుకోవద్దు” అని సూచించారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత: ముగ్గురు నిందితుల అరెస్ట్

**మన దునియా, జూన్ 27,మంచిర్యాల జిల్లా**

రైతులను మోసం చేస్తూ లాభాలు గడించడమే ధ్యేయంగా నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను మందమర్రి పోలీసులు,వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా జరిపిన తనిఖీల్లో పట్టుకున్నారు. నిందితుల నుండి సుమారు 100 కిలోల నకిలీ పత్తి విత్తనాలతో పాటు, రవాణాకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మందమర్రి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ?మందమర్రి మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి , సిబ్బంది మందమర్రి పోలీసులు కలిసి శనివారం ఉదయం 08:30 గంటల ప్రాంతంలో ఎన్ ఎచ్ -363, అందుగులపేట్ శ్రీ కన్వెన్షన్ హాల్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా రెండు బైక్‌లపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి విచారించగా నకిలీ విత్తనాల గుట్టు రట్టయింది.

**అరెస్ట్ అయిన నిందితులు:**

మాకినేని రాఘవేంద్ర (39), నివాసం: మధుర నగర్, పాత మంచిర్యాల. ?కట్ట నరేష్ (41), నివాసం: బురదగూడెం, మందమర్రి.?పుట్టగంటి పవన్ కుమార్ (39), నివాసం: బురదగూడెం, మందమర్రి ?స్వాధీనం చేసుకున్న సొత్తు:?నకిలీ పత్తి విత్తనాలు: ఎటువంటి సర్టిఫైడ్ లేబుల్స్, బిల్లులు లేని 100 కిలోల లూజ్ పత్తి విత్తనాలు. ?ద్విచక్ర వాహనాలు: అపాచీ బైక్, టీవీఎస్



బైక్ అమాయక రైతులను నకిలీ విత్తనాలతో ముంచే ఇలాంటి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు.?రైతులకు నష్టం చేకూరుస్తూ, అక్రమంగా నకిలీ విత్తనాలను రవాణా చేస్తున్న ముఠాను చాకచక్యంగా పట్టుకున్న మందమర్రి ఎస్ఐ నరేష్, పోలీస్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్ , చైతన్య, మహేందర్, సంతోష్ లను ఉన్నతాధికారులు హృదయపూర్వకంగా అభినందించారు.

# ఐటీఐ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం విజ్ఞప్తి





**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;జూన్ 27:**

ప్రభుత్వ ఐటీఐ జన్నారంకు సొంత పరిపాలనా భవనం, శాశ్వత వర్క్‌షాప్‌లు, విశాలమైన తరగతి గదులు ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది.శనివారం సిపిఎం ప్రతినిధి బృందం జన్నారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఐటీఐలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఐటీఐకి ఇప్పటికీ సొంత భవనం లేకపోవడంతో బాలుర పాఠశాలలోని మూడు నుంచి నాలుగు గదుల్లోనే ఐటీఐ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు.ప్రస్తుతం ఐటీఐలో సుమారు 260 మంది విద్యార్థులు (220 మంది బాలురు, 40 మంది బాలికలు) శిక్షణ పొందుతున్నారని, భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున వెంటనే ఐదు శాశ్వత వర్క్‌షాప్‌లు, ఆరు తరగతి గదులు, కార్యనిర్వాహక భవనం, ఆటస్థలం తదితర అన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరారు.అలాగే విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, యూనిఫాంలు అందించడంతో పాటు ఐటీఐ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల భవనం సుమారు 45 సంవత్సరాల క్రితం నిర్మించబడిందని, కొన్ని గదుల్లో పెచ్చులు ఊడిపోతున్నందున వెంటనే మరమ్మత్తులు చేపట్టి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కనికరపు అశోక్, మండల కార్యదర్శి కొండగోర్ల లింగన్న, సీఐటీయూ మండల కార్యదర్శి అంబటి లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు కూకటి కారు బుచ్చయ్య, మండల నాయకులు మగ్గిడి జయ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సంక్షేమ సభను విజయవంతం చేయండి

**మన దునియా, జూన్ 27,మంచిర్యాల జిల్లా**

మంచిర్యాల జిల్లా క్యాతన్ పల్లి సమీపంలోని ఎం ఎన్ ఆర్ గార్డెన్ లో జరగబోయే కార్మికుల సంక్షేమ సభను విజయవంతం చేయాలని బీఆరెస్ నాయకులు శనివారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా బీఆరెస్ నాయకులు మేడిపల్లి సంపత్ మాట్లాడుతూ జూలై ఒకటవ తేదీన జరిగే కార్మిక సంక్షేమ సభను విజయవంతం చేయాలని కోరారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు చేసిందేమిలేదని, ఈ మూడు సంవత్సరాలనుండి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల కోసం ఎటువంటి హక్కులు సాధించలేదని ప్రశ్నించారు. ఈ మూడేండ్ల కాలం లో 750మంది కార్మికులను డిస్మిస్ చేసారని అన్నారు. బీఆరెస్ నాయకులకు ఉద్యమాలు పోరాటాలు కొత్త కాదని నిరంతరం కార్మికుల కోసం పోరాడే బాల్కసుమన్ ని జైల్లో పెట్టడం సరైనది కాదని బాల్కసుమన్ ని కాంగ్రెస్ నాయకులు విమర్శించడం నైతిక హక్కు లేదని అన్నారు. ఈ సభకు కార్మికులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో ఓ రాజశేఖర్, బత్తుల శ్రీనివాస్, బండారి సూరిబాబు, ఎం డి అబ్బాస్, దాసరి శ్రీనివాస్,కే తిరుపతి రెడ్డి, బోరిగం వెంకటేష్, భూపెల్లి కనకయ్య, బట్టు రాజకుమార్, తోట సురేందర్, పల్లె నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.




# చికెన్, మటన్ షాపులకు గుడ్‌బై.. శాకాహార నగరంగా మారనున్న వారణాసి!





**మన దునియా,ఉత్తరప్రదేశ్:జాన్ 27**

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నగరం త్వరలో శాకాహార నగరంగా మారనుంది! ఆ నగర మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ) తన పరిధిలోని మాంసం, చేపలు, కోళ్ల దుకాణాలను నగర శివార్లకు తరలించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా నగర పరిధిలో ఉన్న 350 నుంచి 400 మాంసం దుకాణాలను రాబోయే ఆరు నెలల్లో విడతల వారీగా దీపావళి లోపు శివార్లకు తరలించేందుకు సన్నాహాలు చేస్తోంది.ఈ దుకాణాలను రామ్‌నగర్, సుజాబాద్, గణేశ్‌పూర్, అవలేష్ నగర్, శివపూర్ ప్రాంతాలకు తరలించనున్నారు. దీంతో కాశీ నగరం దేశంలోని రెండవ శాకాహార నగరంగా మారనుంది. ప్రస్తుతం ప్రపంచంలోని ఏకైక పూర్తి శాకాహార పట్టణంగా గుజరాత్‌లోని 'పాలితానా' గుర్తింపు పొందింది. ఇక్కడ 2014 నుంచి మాసం, చేపలు, గుడ్ల విక్రయాలపై నిషేధం అమల్లో ఉంది. వారణాసిలో హిందువులు 72 శాతం, ముస్లింలు 27 శాతం ఉన్నారనే అంచనాలున్నాయి..

# కదులుతున్న స్కూల్ వ్యాన్ నుంచి కిందపడిన ఐదుగురు విద్యార్థులు.. మరోసారి భద్రతపై ప్రశ్నలు.

**స్కూల్ వాహనాల నిర్లక్ష్యం.. ప్రమాదంలో విద్యార్థుల ప్రాణాలు , భద్రతే తొలి ప్రాధాన్యం.**

**మన దునియా,బెంగళూరు కేఆర్ పురం:జాన్ 27**



దేశంలో ఎక్కడైనా పాఠశాల వాహనాలకు సంబంధించిన ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ విద్యార్థుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, విద్యార్థులను రవాణా చేసే వాహనాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉంది.తాజాగా నిన్న బెంగళూరులోని కేఆర్ పురం ప్రాంతంలో ఓ కదులుతున్న స్కూల్ వ్యాన్ నుంచి ఐదుగురు విద్యార్థులు కిందపడిన ఘటన కలకలం రేపింది. అదృష్టవశాత్తూ వారికి తీవ్ర గాయాలు కాలేదు. అయితే ఈ ఘటన పెద్ద విషాదానికి దారితీసే ప్రమాదం ఉండేది.కేవలం తక్కువ ఖర్చు అవుతుందనే కారణంతో రిజిస్ట్రేషన్ లేని స్కూల్ వ్యాన్లు, షేర్డ్ ట్యాక్సీల్లో పిల్లలను పంపించడాన్ని తల్లిదండ్రులు నివారించాలి. పిల్లల ప్రాణ భద్రతకు ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు.అలాగే పాఠశాల విద్యార్థులను రవాణా చేసే అన్ని వాహనాలపై ప్రభుత్వం క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, రిజిస్ట్రేషన్ లేని లేదా నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఒక నిర్లక్ష్యం, ఒక ప్రమాదం... ఒక కుటుంబాన్ని శాశ్వత విషాదంలోకి నెట్టివేయగలదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

# రోటోవేటర్ కింద పడి ట్రాక్టర్ యజమాని మృతి

**మన దునియా, దండేపల్లి;జూన్ 27:**



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ద్వారక గ్రామంలో శనివారం జరిగిన విషాద ఘటనలో ట్రాక్టర్ యజమాని రోటోవేటర్ కింద పడి మృతి చెందాడు.స్థానికుల వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన తోట సంతోష్ (28) వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌కు రోటోవేటర్ అమర్చి పొలంలో పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రోటోవేటర్‌లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని బయటకు తీసి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే మృతి చెందినట్లు సమాచారం.మృతుడికి భార్య, ఇద్దరూ కుమారులు ఉన్నారు. యువకుడి అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

# గోల్డ్ మ్యాన్ సూర్య భాయ్ అరెస్ట్

- పారిపోయేందుకు ప్రయత్నించగా షాద్‌నగర్ వద్ద పోలీసులు పట్టుకున్నట్టు వెల్లడి

**మన దునియా,హైదరాబాద్:జూన్ 27**




గోల్డ్ మ్యాన్ సూర్య భాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ అమాయకులను సూర్య భాయ్ బురిడీ కొట్టించాడు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే.. ఏకంగా బాధితులపై కేసు పెట్టాడు. చివరకు అసలు రంగు బయటపడటంతో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా గోల్డ్ మ్యాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇదీ జరిగింది..

తక్కువ ధరకే విదేశీ బంగారం ఇస్తానంటూ అమాయకుల నుంచి సూర్య భాయ్ లక్షలాది రూపాయలను వసూలు చేసి భారీ మోసానికి తెరతీశాడు. గోల్డ్ మ్యాన్ మాటలు నమ్మి హిమాయత్‌నగర్, నీలోఫర్‌కు చెందిన బాధితులు దాదాపు రూ.30 లక్షలు ఇచ్చారు. అయితే బంగారం ఇవ్వకపోవడంతో సూర్య ఇంటికి వెళ్లిన బాధితులు.. తమ డబ్బులు తమకు తిరిగి ఇచ్చేయాలని కోరారు. దీంతో తన వద్ద ఉన్న మూడు ఐఫోన్లను ఇచ్చి వాటి విలువ రూ.10 లక్షలు అని, అలాగే రూ.20 లక్షల చెక్ ఇచ్చి బాధితులను పంపించేశాడు.అనంతరం బాధతులపైనే సూర్య భాయ్ తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను బెదిరించి ఫోన్ లాక్కెల్లారంటూ సూర్య భాయ్ పోలీసులకు తెలిపాడు. ఈ విషయంలో లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు అసలు నిజాన్ని బయటపెట్టారు. తక్కువ ధరకే బంగారం పేరుతో సూర్య భాయ్ మోసం చేశారంటూ అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును నారాయణగూడ పీఎస్‌కు బదిలీ చేశారు. అయితే అరెస్ట్ భయంతో సూర్య భాయ్ హైదరాబాద్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా షాద్‌నగర్‌లో పోలీసులు పట్టుకున్నారు..

# తిమ్మాపూర్ ఎంపీయూపీఎస్‌లో కలకలం..

# విద్యార్థినుల పట్ల ఎస్‌జీటీ సురేందర్ అసభ్య ప్రవర్తన

- హెడ్‌మాస్టర్ ఫిర్యాదు.. పాఠశాలను సందర్శించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధి -కామెర కవిత

**ఖానాపూర్ ఆర్సి మన దునియా, జూన్ 27:**



మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్ మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల (ఎంపీయూపీఎస్)లో ఓ ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినులను అనుచితంగా తాకడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి ఆరోపణలు స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీశాయి.బాధిత విద్యార్థినుల కథనం ప్రకారం, గత మార్చి నుంచి సంబంధిత ఉపాధ్యాయుడు "గుడ్ టచ్--బ్యాడ్ టచ్" పేరుతో వారిని దగ్గరకు పిలిచి అనుచితంగా తాకడం, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థినులు చివరకు ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రాజుకు తెలియజేశారు.విద్యార్థినుల ఫిర్యాదులపై హెడ్‌మాస్టర్ స్పందించి వారి నుంచి లిఖితపూర్వక వాంగ్మూలాలు, వీడియో ప్రకటనలు సేకరించినట్లు సమాచారం. తొలుత సంబంధిత ఉపాధ్యాయుడికి కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పూర్తి నివేదికను విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపినట్లు తెలుస్తోంది.ఈ ఘటనపై సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని సంబంధిత ఉపాధ్యాయుడిని నిలదీశారు. అనంతరం "ఆ ఉపాధ్యాయుడు మాకు వద్దు.. మాకు రక్షణ కల్పించండి" అంటూ విద్యార్థినులు చేసిన విజ్ఞప్తులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విషయం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశమైంది.ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధి కామెర కవిత పాఠశాలను సందర్శించి బాధిత విద్యార్థినులతో మాట్లాడి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల భద్రతకు విఘాతం కలిగించే ఘటనలను ఏమాత్రం సహించబోమని తెలిపారు. ఉపాధ్యాయుని ప్రవర్తన పై కులం కుశంగా విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం.

# సమాచార హక్కుచట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులుగా ముఖేష్ నియామకం

**ములుగు జిల్లా జూన్ 27 మన దునియా**




ములుగు జిల్లాలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపకులు జాతీయ అధ్యక్షులు జంగటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశాల మేరకు రాష్ట్ర కమిటీ సమిష్టి నిర్ణయంతో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ములుగు జిల్లా అధ్యక్షులు గా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన పసులాది ముఖేష్ ని నియమించడం జరిగింది ఇట్టి నియామక పత్రాన్ని జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు చేతుల మిదిగా అందజేసారు నియామక పత్రం అందున్న అనంతరం పసులాది ముఖేష్ మాట్లాడుతూ సామాన్య ప్రజల బ్రాహ్మాస్రం సమాచార హక్కు చట్టం అని ప్రతీ ప్రభుత్వ ఆఫీస్ లో జరిగే అవినీతిని మనం సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకొని చర్యలు తీసుకోవచ్చని అదేవిధంగా సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేస్తే పరిరక్షణ కమిటీ ఉద్యమిస్తుందని తెలియపరిచారు

# ఆక్రమిత అటవీ భూమిపై అటవీ శాఖ ఉక్కుపాదం

## -- రూ.1.5 కోట్ల విలువైన భూమి స్వాధీనం








**ఖానాపూర్ ఆర్సి మన దునియా; జూన్ 27:**

మండల కేంద్రంలోని మురుమడుగు గ్రామంలో కొంతమంది అడవి భూమిని ఆక్రమించుకున్నారని సమాచారం రావడంతో అడవి శాఖ అధికారులు,ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ భూముల ఆక్రమణలను తొలగించే చర్యల్లో భాగంగా, ఈరోజు ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని కలమడుగు బీట్‌లో మురిమడుగు గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఆక్రమిత అటవీ భూమిని అటవీ శాఖ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న భూమికి చుట్టూ ట్రెంచ్ తవ్వించి అటవీ శాఖ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.1.5 కోట్ల విలువైన అటవీ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు ఇందన్‌పల్లి ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు.అటవీ భూములను ఆక్రమించిన వారి నుంచి వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, అటవీ భూముల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన హెచ్చరించారు. అటవీ భూములను ఆక్రమించిన వారిపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.ఈ స్వాధీనం కార్యక్రమంలో జన్నారం ఎఫ్‌ఆర్‌ఓ వికాస్, ఇందన్‌పల్లి, జన్నారం, తాళ్లపేట రేంజ్‌ల అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి






**మన దునియా, కమలాపూర్,**

ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే పారిశుధ్య పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా చేపట్టిన "ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం" కార్యక్రమంలో భాగంగా శనివారం వరుసగా ఎనిమిదో వారంలో గ్రామంలోని 6, 7, 8 వార్డుల్లో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి మురికి కాలువలు, రహదారులను శుభ్రపరిచి పారిశుధ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో గత ఎనిమిది వారాలుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని సర్పంచ్ తెలిపారు.త్వరలోనే పారిశుధ్య కార్యక్రమాలను పూర్తి చేసి గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గం,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు, యువత, పాల్గొన్నారు

# మొరాయించనున్న కాళేశ్వరం పంపులు..??

**ఎల్‌ఎండీలో అడుగంటిన నీళ్లు.. ఖరీఫ్‌పై నీలినీడలు..**

**"కాళేశ్వరం కుళేశ్వరం" అన్న ప్రభుత్వానికే ఇప్పుడు కాళేశ్వరమే దిక్కా..?**

**మన దునియా,కాళేశ్వరం:జూన్ 27**

ఉత్తర తెలంగాణ రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్న పరిస్థితులు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ (ఎల్‌ఎండీ)లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోవడం, ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోవడం, ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదయ్యే సూచనలు కనిపిస్తుండటంతో ఖరీఫ్ సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.24.034 టీఎంసీల పూర్తి సామర్థ్యం కలిగిన ఎల్‌ఎండీలో ప్రస్తుతం కేవలం 6.006 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉండటం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు జలాశయం నుంచి 232 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతుండగా, ఎగువ నుంచి ఒక్క చుక్క నీరు కూడా రాకపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది.

**ఎల్నినో ఎఫెక్ట్‌తో పెరుగుతున్న ఆందోళన**

వాతావరణ నిపుణులు ఈ ఏడాది ఎల్నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి పరిస్థితుల్లో సాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో రైతులు ముందుగానే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కాళేశ్వరమే దిక్కు..!**

ఎల్‌ఎండీతో పాటు పలు ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్న వేళ, ఉత్తర తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టే ప్రధాన ఆధారంగా మారిందని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై తీవ్ర విమర్శలు చేసిన అధికార పార్టీ నేతలే ఇప్పుడు ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి సారించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

**మేడిగడ్డ మరమ్మతులపై సర్కార్ ఫోకస్**

మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు సంబంధించి జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ పరీక్షలు పూర్తయ్యాయి. జియో ఫిజికల్ రాడార్ పరీక్షలు కూడా తుది దశకు చేరుకున్నాయి. ఈ పరీక్షల అనంతరం బ్యారేజీ మరమ్మతులపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**మొరాయించనున్న కాళేశ్వరం పంపులా..?**

కాళేశ్వరం పంప్ హౌస్‌లు, ఎత్తిపోతల వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంలో ఆలస్యం జరిగితే, భవిష్యత్తులో సాగునీటి అవసరాలపై ప్రభావం పడే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ రైతుల్లో ఆందోళన మరింత పెరుగుతోంది.

**"కాళేశ్వరం కుళేశ్వరం" నుంచి "కాళేశ్వరమే దిక్కు" వరకు..!**

ఒకప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టును తీవ్రంగా విమర్శించిన రాజకీయ నాయకులే ఇప్పుడు ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి పెట్టడం గమనార్హం. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల రైతుల్లో మాత్రం ఒకే ప్రశ్న వినిపిస్తోంది.

**"వర్షాలు లేకపోతే.. కాళేశ్వరం నీళ్లు ఎప్పుడు వస్తాయి?"**

ఎల్‌ఎండీలో తగ్గిన నీటి నిల్వలు, ఎల్నినో ప్రభావం, మేడిగడ్డ మరమ్మతులు, కాళేశ్వరం భవిష్యత్‌పై నెలకొన్న అనిశ్చితి ప్రస్తుతం తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# దోపిడి డాక్టర్లు లేని ఆసుపత్రుల్లో రోగుల నిలువు






**ఎలాంటి అర్హతలు లేకున్నా హాస్పిటల్స్, మెడికల్ ల నిర్వాహణ చోద్యం చూస్తున్న వైద్య ఆరోగ్యశాఖ... డ్రగ్ కంట్రోల్ అధికారులు**

**నిజామాబాదు జిల్లా : మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ స్పెషల్ స్టోరీ:

వైద్యో నారాయణో హరి అని డాక్టర్లను దేవుడిగా కొలిచే కల్చర్ మనది. ఎందుకంటే తల్లి గర్భంలో జన్మించిన వ్యక్తికి పునర్జన్మ ప్రసాదించింది వైద్యుడే కాబట్టి మన పూర్వీకులు వైద్యుడిని నారాయణుడిగా కొలిచారు. ఎలాంటి క్లిష్టపరిస్థితుల్లో ఉన్న వైద్యం ద్వారా సేవలు చేసే అర్హత కొందరికే ఉంటుంది. గతంలో ఆయుర్వేద వైద్యం ప్రాచీన వైద్యంగా పేరు గాంచగా తర్వాత కాలంలో యూనాని, అలోపతి (ఇంగ్లీష్) వైద్యం చాలా మందికి ఎలాంటి రోగాన్నైనా నయం చేస్తుందని ప్రధానంగా అలోపతి వైద్యంతో సాధ్యం కానిది లేదనే నానుడి ఉంది. కేవలం మరణాన్నిఆపలేని శక్తిగా మాత్రమే ఇంగ్లీష్ వైద్యానికి పేరు. మిగిలిన ఎలాంటి క్లిష్టపరిస్థితుల్లో ఉన్న రోగికైనా వైద్యం చేయడం అలోపతికే దక్కింది. అలోపతి వైద్యానికి ఎంబీబీఎస్ పునాది కాగా దాని తర్వాత పీజీలు చేసే స్పెషలైజేషన్ ద్వారా వైద్యులు ఆయా రంగాల్లో నిష్ణాతులుగా ఎదుగడం సహజం. కానీ కొందరు శంకర్ దాదా ఎంబీబీఎస్ లగా ఫేక్ డిగ్రీలతో వైద్యం చేసిన సంఘటనలు కొకొల్లాలు. వైద్య మండలి ఎన్నిసార్లు కొరడా ఝుళిపించిన ఎక్కడా ఒకచోటా ఫేక్ డాక్టర్ల బాగోతాలు బటబయలవుతున్నాయి. కానీ వదులాల్సిందే. వైద్యం చేసుకోకముందే సహజ సిద్దంగా కొందరు తమ ఇంటి వద్దనే సొంత వైద్యం చేసుకుని తీరా ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చిన తర్వాత టెస్టులు, స్కానింగ్ లలో వచ్చిన రిపోర్టులతో రోగ నిర్ధారణ జరిగిన తర్వాత అందించే వైద్యంతో, జబ్బు తగ్గిందని అనుకునే లోపే రోగి వద్ద అందినకాడికి దంచుకునే కల్చర్ అద్దె వైద్యులు ఉన్న ఆసుపత్రుల్లో కొనసాగుతుంది. చాలామట్టుకు వైద్యం వికటించిన ఘటనలు కేవలం అద్దె ఆసుపత్రుల్లో ఎక్కువనే సంగతి తెలిసిందే. పధానంగా ప్రతీయేటా ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి వైద్యులు ఉన్నారా, వారే ఆసుపత్రులు నడుపుతున్నారా అనే విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ విస్మరించిందనే వాదనలున్నాయి. కాదు కాదు ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్న యజమాన్యాలతో కుమ్మక్కై అద్దె సర్టిపికెట్లతో హాస్పిటళ్లు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలున్నాయి.కోట్లు వెనుకేసుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు. డాక్టర్లుగా పీజీలు చదివిన వారు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న వారు ప్రైవేట్ ఆసుపత్రులు ఏర్పాటు చేసిన యజమాన్యం చెప్పిన విధంగానే ట్రీట్ మెంట్ చేస్తున్నారనేది అందరికీ తెలిసిన విషయమే.రోగి ఆసుపత్రికి రిఫర్ గా వచ్చిందంటే దోపిడిని కొనితెచ్చుకున్నట్లే. ఆర్ ఎంపీ, పీఎంపీలు మొదలుకుని ఇతర వైద్యులు రిఫర్ చేసిన వారికి వచ్చిన బిల్లులో చెరిసగం పంచుకునే కల్చర్ కొనసాగుతుంది. ఆసుపత్రికి వచ్చిన రోగిని పరీక్షించకుండానే అడ్డమైన టెస్టులు చేయడం పరిపాటిగా మారింది. అదిచాలదని అందులో రోగ నిర్ధారణ కాలేదని, స్కానింగ్ లతో పాటు ఎంఆర్ఎ వరకు పరీక్షలు నిర్వహించేస్తున్నారు. చివరకు మందుల చీట్టీలో రాసే మెడిసిన్ ఇతర మెడికల్ లో దొరకవని, కనీసం పది శాతం డిస్కౌంట్ ఇవ్వకుండా దోచేస్తున్నారు. ఇప్పుడు సాధారణంగా ఎంబీబీఎస్ పై స్థాయి వైద్యుడి వద్ద జ్వరం వచ్చిన కనీసం 2 నుంచి 3 వేల చేతి చమురు అద్దె సర్టిఫికెట్లతో ఏర్పాటు చేసిన ఆసుపత్రుల్లో రోగికి చేటుగా మారాయి. ఎందుకంటే వైద్యులు కానీ వారు కేవలం లాభాపేక్షతో ఆసుపత్రులను ఏర్పాటు చేయడంతో అందులో వైద్యం నాసీరకమే కాకుండా అక్కర్లేని వైద్యం చేస్తున్నారని చెప్పాలి. ఎంబీబీఎస్, ఎండీలు, ఎంఎస్ లను విద్యార్హాత కలిగిన డాక్టర్లను తమ ఆసుపత్రుల్లో అగ్రిమెంట్ కింద నియమించుకున్న వ్యక్తులు వారితో రోగుల దోపిడిని నడిపించడం విశేషం. అద్దె సర్టిఫికెట్లతో మెడికల్ లను, ఆసుపత్రులను ఏర్పాటు చేసిన కొందరు మాఫియా లాగా అవతారం ఎత్తారు. ప్రైవేట్ ప్రాక్టీషినర్లకు ఒప్పందం చేసుకుని రోగులను, ఆసుపత్రులకు రిఫర్ గా తరలించి నిలువు దోపిడి చేస్తున్నారు. అక్కర్లేని టెస్టులు, స్కానింగ్ లు ఏకంగ సర్జరీలకు వెనుకాడడం లేదన్నది జగమెరిగిన. సత్యం. కొందరు ఆర్ ఎంపీలు కూడా ఆసుపత్రులలో భాగస్వామ్యులు(పార్టనర్)గా చెలామణి అవుతూ దోపిడిలో భాగస్వామ్యం అవుతున్నారు. ఇప్పుడు ఎండీ న్యూరో, ఫిజిషియఎఅర్హాత కలిగిన డాక్టర్లు ఏడాదిపాటు కలిగి ఉంటే కోట్లు వెనుకేసుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు.

# గూడ్స్ వాహనాల్లో గొర్రెల మందల్లా కూలీలు: పట్టించుకోని RTA అధికారులు!

**ప్యాసింజర్ ఆటోలు కావు...సామాన్లు మోసే గూడ్స్ వాహనాలు!**

**పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినా బేఖాతరు**

**నిత్యం ఒక్కో వాహనంలో సుమారు 50 మంది కూలీల ప్రమాదకర ప్రయాణం**

**అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ స్థానికుల ఆగ్రహం**

**మన దునియా,ధర్మఘంట గద్వాల జూన్ 27**



జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రం మీదుగా ప్రతీ రోజు కూలీల రవాణా అక్రమంగా, అత్యంత ప్రమాదకరంగా సాగుతోంది. నిబంధనల ప్రకారం కేవలం సరుకులు మాత్రమే రవాణా చేయాల్సిన గూడ్స్ ఆటోలను, ఇక్కడి డ్రైవర్లు ప్రయాణికుల రవాణాకు వాడుతున్నారు. లాభాల కక్కుర్తితో నిత్యం ఒక్కొక్క గూడ్స్ వాహనంలో సుమారు 50 మందికి పైగా కూలీలను గొర్రెల మందల్లా ఎక్కించి రోడ్లపైకి వదులుతున్నారు. అయినప్పటికీ, రవాణా శాఖ అధికారులు మాత్రం ఈ దారుణాన్ని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రం గుండా ప్రతిరోజూ ఇన్ని వాహనాలు ఇంత ప్రమాదకరంగా వెళ్తున్నా, ఆర్టీఏ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రాణాలు గాల్లోనే..**

గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులకు ఎలాంటి రక్షణ ఉండదు. కనీసం కూర్చోవడానికి సీట్లు కూడా లేని ఆ వాహనాల్లో, కూలీలు ఒకరినొకరు పట్టుకుని నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డుపై వాహనం కొద్దిగా అదుపు తప్పినా ఊచకోత కోసినట్లు కూలీల ప్రాణాలు గాల్లో కలవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరగకముందే ఆర్టీఏ,మరియు స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ఈ గూడ్స్ ఆటోల అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# 188 సర్వే నంబర్ భూమి పట్టా భూమే..

**ప్రభుత్వ స్థలం కాదని భూ యజమానుల స్పష్టీకరణ**

**మన దునియా,వరంగల్:జూన్ 27**

ఖిలా వరంగల్ మండల పరిధిలోని 188 సర్వే నంబర్లో ఉన్న భూమి ప్రభుత్వ భూమి కాదని, అది పట్టా భూమేనని భూ యజమానులు మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.ఈ భూమికి 1956 సంవత్సరం నుంచే పట్టా పాస్‌బుక్కులు ఉన్నాయని, అనంతరం 2005లో గణపతి ఎడ్యుకేషనల్ సొసైటీ చట్టబద్ధంగా కొనుగోలు చేసిందని తెలిపారు.అయితే, కొందరు కావాలనే ఈ భూమిని ప్రభుత్వ స్థలంగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఖిలా వరంగల్ ఎమ్మార్వో మహమ్మద్ ఇక్బాల్ తమకు సహకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారం కూడా పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు.ఎమ్మార్వో ఇక్బాల్‌పై నిరాధార ఆరోపణలు చేసి ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు మానుకోవాలని భూ యజమానులు విజ్ఞప్తి చేశారు. వాస్తవాలను తెలుసుకుని మాత్రమే ప్రచారం చేయాలని మీడియా సమావేశంలో కోరారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**యోగా శిక్షకులు అజయ్**

**యోగా వలన సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని యోగ శిక్షకులు మిద్దె అజయ్ అన్నారు.**

**మన దునియా:నిజామాబాదుజిల్లా ప్రతినిధి:**



కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు ఆదేశాలతో అధ్యాపకులు విద్యార్థులకు యోగ శిక్షణ, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, యోగా శిక్ష కుడు అజయ్ కుమార్ రెండు గంటల పాటు యోగా ఆసనాలు వేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అలాగే యోగా వలన కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు యోగా కోసం సమయం కేటాయించాలి అని సూచించారు. యోగా వలన ఆరోగ్యం తో పాటు మానసిక ధైర్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు. వీరేశం, సతీష్ లు మాట్లాడుతు యోగా ప్రాధాన్యత గురించి తెలియచేశారు. ఇక్కడ చదివే విద్యార్థులకు విద్య తో పాటు అన్ని రంగాలలో తీర్చి దిద్దెందుకు అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారని విద్యార్థులు అవకాశాలను సధ్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మల్లేశం, శ్రీకాంత్, అలంపల్లి శ్రీనివాస్, సరస్వతి, మనీషా, హారిక సిబ్బంది నరసయ్య, సోటేరియా పాల్గొన్నారు.



# పిడుగుపాటుకు 22 ఆవులు మృతి బాధితున్ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు





**ఫోన్ ద్వారా పరామర్శించి విషయాలు తెలుసుకున్న ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**

మన దునియా, వాజేడు ,జూన్ 27

ములుగు జిల్లా తాడ్వాయి మండలం అంకంపల్లి గ్రామంలో ఘోర విషాదం చోటుచేసుకుంది రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఒక్కసారిగా పిడుగు పడటంతో గ్రామానికి చెందిన మంకిడి సమ్మయ్య కు చెందిన 22 ఆవులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాయి ఘటన స్థలాన్ని పరిశీలించిన నాయకులు ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఘటన స్థలానికి చేరుకున్నారు బి ఆర్ఎస్ నాయకులు తాటి కృష్ణ కాకులమర్రి ప్రదీప్ రావు కాటాపురం సర్పంచ్ దిడ్డి మోహన్ రావు తదితరులు అంకంపల్లి గ్రామాన్ని సందర్శించి మృతి చెందిన ఆవులను పరిశీలించారు ఆవులను నమ్ముకొని జీవిస్తున్న పేద రైతు కుటుంబానికి ఇంత పెద్ద నష్టం జరగడంపై స్థానికులు మరియు పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు ప్రభుత్వ అధికారులు స్పందించి బాధితులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో తాటి కృష్ణ ప్రదీప్ రావు కాటాపురం సర్పంచ్ దిడ్డి మోహన్ రావు బీరెల్లి సర్పంచ్ విజయ చంద్రం మాజీ జెడ్పిటిసి పులసం సరోజన పురుషోత్తం పోదేం కృష్ణ ప్రసాద్ మాజీ ఎంపీపీ కొండూరి నరేష్ మాజీ ఎంపీటీసీ దానక నరసింహారావు దిలావర్ ఖాన్ ఉపసర్పంచ్ పాలకుర్తి బాబు యలవర్తి శ్రీనివాసరావు వహీద్ రోశయ్య బెజ్జూరి శ్రీకాంత్ రామకృష్ణ గొప్ప స్వామి తదితరులు బి.ఆర్.ఎస్ నాయకులు పాల్గొన్నారు

# ఫీఫా వరల్డ్ కప్‌లో చరిత్ర సృష్టించిన కేప్ వర్దె.. నాకౌట్‌లో అతి చిన్న దేశం

**సౌదీ అరేబియాతో మ్యాచ్ డ్రా చేసుకుని నాకౌట్‌కు అర్హత**

**రౌండ్ ఆఫ్ 32లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్న కేప్ వర్దె**

**ఈ ఘనత సాధించిన అతి చిన్న దేశంగా సరికొత్త రికార్డ్**

**గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచుల్లోనూ ఓటమి లేకుండా నాకౌట్‌కు**



ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఓ చిన్న దేశం అద్భుతం చేసింది. తమ చరిత్రలోనే తొలిసారి ఫీఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 32కు అర్హత సాధించి కేప్ వర్దె సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. సౌదీ అరేబియాతో జరిగిన కీలకమైన గ్రూప్-హెచ్ మ్యాచ్‌ను గోల్స్ లేకుండా 'డ్రా'గా ముగించిన కేప్ వర్దె, గ్రూప్‌లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ చారిత్రక విజయంతో జులై 3న మయామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనాతో తలపడనుంది. ఫీఫా ప్రపంచకప్ నాకౌట్ దశకు చేరిన అతి చిన్న దేశంగా కేప్ వర్దె రికార్డు సృష్టించింది.గ్రూప్ దశలో కేప్ వర్దె ప్రదర్శన అద్భుతం. ఆడిన మూడు మ్యాచులనూ డ్రా చేసుకుని, మూడు పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. దీంతో మాజీ ఛాంపియన్ ఉరుగ్వే, సౌదీ అరేబియా జట్లను వెనక్కి నెట్టి నాకౌట్‌కు అర్హత సాధించింది. సౌదీతో జరిగిన మ్యాచ్‌లో కేప్ వర్దె జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. విల్లీ సెమెడో, కెవిన్ పినా వంటి ఆటగాళ్లు గోల్స్ చేయడానికి చేసిన ప్రయత్నాలు త్రుటిలో విఫలమయ్యాయి. సౌదీ గోల్ కీపర్ మహమ్మద్ అల్ ఒవైస్ అద్భుతమైన సేవ్లతో జట్టును ఆదుకున్నాడు. మ్యాచ్ ముగియడానికి 15 నిమిషాల ముందు లారోస్ దువార్టే కొట్టిన షాట్‌ను ఒవైస్ అడ్డుకోవడంతో కేప్ వర్దె ఆధిక్యం కోల్పోయింది. అయినప్పటికీ, మ్యాచ్‌ను డ్రాగా ముగించి నాకౌట్ బెర్తును ఖరారు చేసుకుంది.ఈ ఘనతతో కేప్ వర్దె మరో అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. తమ తొలి ప్రపంచకప్ గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా నాకౌట్‌కు చేరిన మూడో ఆఫ్రికన్ దేశంగా నిలిచింది. గతంలో మొరాకో (1986), కామెరూన్, నైజీరియా (1998, 2014) ఈ ఘనత సాధించాయి.ఇతర గ్రూపుల విషయానికొస్తే, గ్రూప్-జీలో ఈజిప్ట్‌ను ఓడించి బెల్జియం అగ్రస్థానంలో నిలిచింది. గ్రూప్-ఏలో దక్షిణాఫ్రికా రెండో స్థానం దక్కించుకుని కెనడాతో తలపడనుంది. మూడో స్థానం పొందిన జట్లలో దక్షిణ కొరియా కూడా నాకౌట్‌కు అర్హత సాధించింది.

**రౌండ్ ఆఫ్ 32కు అర్హత సాధించిన జట్లు:**

మెక్సికో, దక్షిణాఫ్రికా, స్విట్జర్లాండ్, కెనడా, బోస్నియా అండ్ హెర్జెగోవినా, బ్రెజిల్, మొరాకో, యునైటెడ్ స్టేట్స్, ఆస్ట్రేలియా, పరాగ్వే, జర్మనీ, కోట్ డి ఐవరీ, ఈక్వెడార్, నెదర్లాండ్స్, జపాన్, స్వీడన్, బెల్జియం, ఈజిప్ట్, స్పెయిన్, కేప్ వర్దె, ఫ్రాన్స్, నార్వే, సెనెగల్, అర్జెంటీనా, కొలంబియా, పోర్చుగల్, ఇంగ్లాండ్, ఘనా.రేపటి నుంచి రౌండ్ ఆఫ్ 32 మ్యాచులు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా కేప్ వర్దె, అర్జెంటీనా మధ్య జరిగే మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

# టెన్నిస్ కోర్ట్ నుంచి బోర్డ్‌రూమ్‌కు.. జొకోవిచ్ కొత్త ఇన్నింగ్స్

**ప్రైవేట్ ఈక్విటీ సంస్థ జనరల్ అట్లాంటిక్‌కు గ్లోబల్ అడ్వైజర్‌గా జొకోవిచ్**


**సంస్థ నాయకత్వం, భాగస్వామ్య కంపెనీలతో కలిసి పనిచేయనున్న టెన్నిస్ స్టార్**

**ఆరోగ్యం, వెల్నెస్ రంగంలో విస్తరించేందుకు ఉపయోగపడనున్న జొకోవిచ్ అనుభవం**

**రికార్డుస్థాయి 25వ గ్రాండ్‌స్లామ్ లక్ష్యంతో వింబుల్డన్ బరిలోకి దిగనున్న తరుణంలో ఈ నియామకం**

**క్రీడల్లోని క్రమశిక్షణే వ్యాపారంలోనూ విజయానికి మూలమని వ్యాఖ్య**

టెన్నిస్ ప్రపంచంలో తిరుగులేని రారాజుగా వెలుగొందుతున్న నొవాక్ జొకోవిచ్, ఇప్పుడు వ్యాపార ప్రపంచంలోకి ఓ కీలక అడుగు వేశారు. ప్రఖ్యాత గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ 'జనరల్ అట్లాంటిక్'కు గ్లోబల్ స్ట్రాటజిక్ అడ్వైజర్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ విషయాన్ని సదరు సంస్థ అధికారికంగా ప్రకటించింది. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా వింబుల్డన్ బరిలోకి దిగడానికి కొద్ది రోజుల ముందు ఈ ప్రకటన వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ కొత్త బాధ్యతల్లో భాగంగా జొకోవిచ్... జనరల్ అట్లాంటిక్ సంస్థ నాయకత్వ బృందంతో, దాని పోర్ట్‌ఫోలియో కంపెనీలతో, పెట్టుబడిదారులతో కలిసి పనిచేస్తాడు. ముఖ్యంగా నాయకత్వ పటిమ, స్థితిస్థాపకత, ఆవిష్కరణలు వంటి అంశాలపై తన అనుభవాలను, దృక్పథాన్ని పంచుకోనున్నాడు. ఈ నియామకం ద్వారా జొకోవిచ్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని, ముఖ్యంగా హెల్త్, వెల్నెస్ రంగంలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని జనరల్ అట్లాంటిక్ భావిస్తున్నట్లు 'బ్లూమ్‌బెర్గ్' తన కథనంలో పేర్కొంది.ఇటీవలి కాలంలో జొకోవిచ్ వ్యాపార రంగంలో తన పెట్టుబడులను విస్తరిస్తున్నాడు. 2023లో వెల్నెస్ బ్రాండ్ 'వాటర్‌డ్రాప్'లో పెట్టుబడి పెట్టిన టెన్నిస్ స్టార్, 2024లో 'హెుపు' అనే సప్లిమెంట్ కంపెనీని సహ-స్థాపించాడు. 2025లో 'కాబ్ ఫుడ్స్' అనే స్నాక్ ఫుడ్ సంస్థను ప్రారంభించడంతో పాటు 'ఇంక్రిడివేర్' అనే వేరబుల్స్ కంపెనీకి కూడా మద్దతుగా నిలిచాడు.ఈ నియామకంపై జొకోవిచ్ స్పందిస్తూ.. "క్రీడల్లో అత్యున్నత స్థాయిలో రాణించడానికి అవసరమైన సూత్రాలే, గొప్ప వ్యాపారాలను నిర్మించడానికి కూడా వర్తిస్తాయి. క్రమశిక్షణ, దీర్ఘకాలిక ఆలోచనా విధానం, నిరంతరం మెరుగుపడాలనే తపన ఇరు రంగాల్లోనూ కీలకం. బిల్, ఆయన బృందం నిర్మిస్తున్న ఈ సంస్థ ప్రగతిలో భాగం పంచుకోవడానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని తెలిపాడు.15 ఏళ్ల వయసులోనే ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్‌గా మారిన జొకోవిచ్, టెన్నిస్ చరిత్రలోనే గొప్ప ఆటగాడిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. తన కెరీర్‌లో రికార్డు స్థాయిలో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు, ట్రిపుల్ కెరీర్ గ్రాండ్‌స్లామ్, పారిస్ 2024 ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో కెరీర్ సూపర్ స్లామ్ సాధించాడు. అంతేకాకుండా ఆల్-టైమ్ రికార్డుగా 428 వారాల పాటు వరల్డ్ నంబర్ 1 ర్యాంకులో కొనసాగడం, రికార్డు స్థాయిలో 8 సార్లు ఇయర్-ఎండ్ నంబర్ 1గా నిలవడం, అపూర్వంగా 40 ఏటీపీ మాస్టర్స్ 1000 టైటిళ్లను గెలుచుకోవడం వంటి ఘనతలతో గ్లోబల్ స్పోర్ట్స్ ఐకాన్‌గా తన వారసత్వాన్ని పదిలపరుచుకున్నాడు. ఆటలో జొకోవిచ్ ప్రదర్శించిన మానసిక దృఢత్వం, క్రమశిక్షణే ఇప్పుడు కార్పొరేట్ ప్రపంచంలోనూ అతనికి మార్గనిర్దేశం చేయనున్నాయి.



# వైభవ్ సూర్యవంశీపై దిలీప్ వెంగ్‌సర్కార్ కీలక వ్యాఖ్యలు




**వైభవ్ సూర్యవంశీ టెస్టు క్రికెట్‌లోనూ రాణించగలడని దిలీప్ వెంగ్‌సర్కార్ ధీమా**

**వైభవ్ కేవలం వైట్-బాల్ క్రికెటర్ అనే వాదనను కొట్టిపారేసిన దిలీప్**

**ఐర్లాండ్‌తో రెండో టీ20లో వైభవ్‌కు ఆడే అవకాశం రావచ్చుని జోస్యం**

టీమిండియా యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కేవలం టీ20 ఫార్మాట్‌కు పరిమితం కాదని, టెస్టు క్రికెట్‌లోనూ రాణించగల సత్తా అతడికి ఉందని భారత మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ అభిప్రాయపడ్డాడు. ఐర్లాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వైభవ్‌ను ఆడించాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, అతడిని కేవలం వైట్-బాల్ స్పెషలిస్ట్‌గా మాత్రమే చూడవద్దని ఆయన సూచించాడు. ఐర్లాండ్‌తో జరగనున్న రెండో టీ20లో వైభవ్‌కు అవకాశం లభించవచ్చని జోస్యం చెప్పాడు. వైభవ్ కేవలం టీ-20లు మాత్రమే ఆడగలడని, వన్డేలు, టెస్టులకు పనికిరాడని కొందరు చేస్తున్న వ్యాఖ్యలను వెంగీ ఈ సందర్భంగా కొట్టిపారేశాడు.బీహార్‌కు చెందిన వైభవ్, 12 ఏళ్ల ప్రాయంలోనే రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్‌ను కైవసం చేసుకున్నాడు. ముఖ్యంగా 237.30 స్ట్రైక్ రేట్‌తో, కేవలం 38 బంతుల్లోనే సెంచరీ బాది టీ20ల్లో పిన్న వయస్కుడైన శతకవీరుడిగా రికార్డు సృష్టించాడు. అంతకుముందు అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 80 బంతుల్లో 175 పరుగులు చేసి భారత్‌కు ప్రపంచకప్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, వైభవ్ ఫస్ట్-క్లాస్ రికార్డు సాధారణంగా ఉండటంతో, అతను టెస్టులకు సరిపోతాడా అనే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో వెంగ్‌సర్కార్ స్పందిస్తూ, "అతడిలో అసాధారణ ప్రతిభ ఉంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో అవకాశం వచ్చినప్పుడు కచ్చితంగా గొప్ప ప్రదర్శన చేస్తాడు" అని ధీమా వ్యక్తం చేశాడు.

# ఐర్లాండ్‌తో ఓటమికి ప్రధాన కారణం ఏంటో చెప్పిన అభిషేక్ శర్మ

**తొలి టీ20లో భారత్‌పై ఐర్లాండ్ 34 పరుగుల తేడాతో ఘన విజయం**

**అన్ని ఫార్మాట్లలోనూ టీమిండియాపై ఐర్లాండ్‌కు ఇదే తొలి గెలుపు**

**అర్ధ శతకంతో రాణించిన అభిషేక్ శర్మ.. విఫలమైన మిగతా బ్యాటర్లు**

టీ20 ప్రపంచ ఛాంపియన్ భారత్‌కు ఐర్లాండ్ జట్టు ఊహించని షాకిచ్చింది. రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా నిన్న బెల్‌ఫాస్ట్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో 34 పరుగుల తేడాతో టీమిండియాను చిత్తు చేసింది. ఈ విజయంతో ఐర్లాండ్ క్రికెట్ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఇప్పటివరకు ఏ ఫార్మాట్‌లోనూ భారత్‌పై గెలవని ఆ జట్టు, ఈ మ్యాచ్‌తో ఆ రికార్డును బద్దలుకొట్టింది. ఐర్లాండ్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్య ఛేదనలో భారత జట్టు 18.5 ఓవర్లలో 148 పరుగులకే కుప్పకూలింది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్, నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ లార్కన్ టక్కర్ అద్భుతమైన అర్ధ శతకంతో జట్టుకు బలమైన పునాది వేశాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్లతో నిండిన లైనప్ ఐర్లాండ్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయింది.యువ బ్యాటర్ అభిషేక్ శర్మ కేవలం 20 బంతుల్లో 50 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. మిగతా బ్యాటర్ల నుంచి అతనికి సరైన సహకారం అందకపోవడంతో భారత ఓటమి ఖాయమైంది. ఐర్లాండ్ బౌలర్లలో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మాథ్యూ హంఫ్రీస్, మాట్ హేలార్డ్ చెరో మూడు వికెట్లు పడగొట్టి భారత పతనాన్ని శాసించారు. అరంగేట్ర బౌలర్ జై మూంద్రా కూడా రెండు కీలక వికెట్లు తీసి తన జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు.మ్యాచ్ అనంతరం భారత ఓటమిపై అభిషేక్ శర్మ స్పందించాడు. "పరిస్థితులకు త్వరగా అలవాటు పడకపోవడమే మా ఓటమికి ప్రధాన కారణం. వరుసగా మ్యాచ్‌లు ఆడేటప్పుడు, ప్రాక్టీస్ సెషన్లలోనే పిచ్ స్వభావాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఒక బలమైన జట్టుగా మేం త్వరగా అలవాటు పడటంలో విఫలమయ్యాం. ఈరోజు అదే జరిగింది" అని అభిషేక్ పేర్కొన్నాడు. ఈ విజయంతో సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన ఐర్లాండ్‌తో భారత్ రెండో, చివరి టీ20 మ్యాచ్‌ను రేపు ఆడనుంది.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## వైజాగ్‌లో 'మా ఇంటి బంగారం' విజయోత్సవం.. సీక్వెల్ ఉంటుందని ప్రకటన



నటి సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర బృందం విశాఖపట్నంలో విజయోత్సవ వేడుకను నిర్వహించింది. శుక్రవారం సాయంత్రం ఆర్‌కే బీచ్ సమీపంలోని గోకుల్ పార్క్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సందడి చేశారు. ఇదే వేదికపై సినిమాకు సీక్వెల్ ఉంటుందని నిర్మాత రాజ్ నిడిమోరు అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ, సినిమా విడుదలకు ముందు ఫలితంపై కొంత ఆందోళన చెందినప్పటికీ, ప్రేక్షకులు ఈ చిత్రాన్ని విశేషంగా ఆదరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనారోగ్యం తర్వాత తాను తిరిగి సినిమాల్లో నటించడానికి తన భర్త, నిర్మాత రాజ్ నిడిమోరు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని ఆమె పేర్కొన్నారు. విశాఖ ప్రజలు తనపై ఎల్లప్పుడూ చూపే ప్రత్యేక అభిమానాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.దర్శకురాలు నందిని రెడ్డి మాట్లాడుతూ, వైవిధ్యభరితమైన కథలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. సమంత అద్భుత నటన సినిమాకు ప్రధాన బలమని ఆమె కొనియాడారు. అనంతరం, పోలీసుల సమక్షంలో "నో డ్రగ్స్, ఎడ్యుకేషన్ ఈజ్ ప్రెషియస్" అనే అవగాహన బ్యానర్‌ను సమంత ఆవిష్కరించారు. గర్భవతిగా ఉన్న సమంతకు మహిళలు మంగళ హారతులు ఇచ్చి ఆశీర్వదించడం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సమంత సొంత నిర్మాణ సంస్థ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందింది. జూన్ 19న విడుదలైన ఈ యాక్షన్-డ్రామా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తోంది. ఈ కార్యక్రమంలో సీనియర్ నటీమణులు గౌతమి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' రిలీజ్ డేట్ ఫిక్స్

**వెంకటేష్, త్రివిక్రమ్ కాంబో మూవీ 'ఆదర్శ కుటుంబం'**

**అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల**

**హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టి.. సంగీతం తమన్**

**హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మాణం**

**'ఏకే 47' అనే ట్యాగ్‌లైన్‌తో పెరుగుతున్న ఆసక్తి**

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'ఆదర్శ కుటుంబం.. హౌస్ నెం.47 (ఏకే-47)'. ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా, ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్రబృందం కీలక ప్రకటన చేసింది. సినిమా విడుదల తేదీని అధికారికంగా ఖరారు చేస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. వెంకటేష్‌కు ఇది 77వ చిత్రం కావడం విశేషం. ఈ సినిమాలో ఆయన సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది.'ప్రతి కుటుంబం గుర్తుంచుకోవాల్సిన తేదీ' అనే క్యాప్షన్‌తో రిలీజ్ చేసిన పోస్టర్‌లో 'ఆదర్శ కుటుంబం' టైటిల్‌తో పాటు 'ఖాఖ 47' అని ట్యాగ్ తో సినిమాపై అంచనాలను పెంచేశారు. దీంతో ఇది క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉంటూనే, యాక్షన్ అంశాలు కూడా ఉంటాయనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా, త్రివిక్రమ్ నుంచి చాన్నాళ్ల తర్వాత రాబోతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. 2024లో వచ్చిన 'గుంటూరు కారం' తర్వాత త్రివిక్రమ్ లాంగ్ గ్యాప్ తీసుకున్నారు. ఇప్పుడు 'ఆదర్శ కుటుంబం' తెరకెక్కిస్తున్నారు.





## అమ్మను తలచుకోని రోజు లేదు'


**తల్లి జయంతి సందర్భంగా భావోద్వేగ పోస్ట్ చేసిన మాధురి దీక్షిత్**

బాలీవుడ్ సీనియర్ నటి మాధురి దీక్షిత్ తన తల్లి స్నేహలతా దీక్షిత్ జయంతి సందర్భంగా భావోద్వేగ సందేశాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. తల్లిని తలుచుకుంటూ ఆమె చేసిన పోస్ట్ అభిమానులను కదిలించింది.ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో తల్లితో కలిసి దిగిన పలు ఫొటోలతో కూడిన కోలాజ్‌ను షేర్ చేసిన మాధురి, "హ్యాపీ బర్త్‌డే ఆఈ... నిన్ను గుర్తు చేసుకోని రోజు అంటూ లేదు. జీవితంలోని ప్రతి చిన్న క్షణంలోనూ నీ ప్రేమ, నీ సాన్నిధ్యం నాకు అనుభూతి అవుతూనే ఉంటాయి. నీ ప్రేమ, ధైర్యం, ఆప్యాయత మాకు ప్రతిరోజూ మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. నిన్ను ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాం. ప్రేమతో నీ పుట్టినరోజును జరుపుకుంటున్నాం" అని రాసుకొచ్చారు. మాధురి తల్లి స్నేహలతా దీక్షిత్ 2023 మార్చి 12న ముంబైలోని తన నివాసంలో 91 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ప్రస్తుతం రెండు ప్రాజెక్టులతో బిజీ సినిమాల విషయానికి వస్తే, మాధురి తాజాగా 'మా బెహెన్' చిత్రంలో నటిస్తున్నారు. సురేష్ త్రివేణి దర్శకత్వంలో నెట్‌ఫ్లిక్స్ కోసం రూపొందుతున్న ఈ డార్క్ కామెడీలో త్రిప్తి డిమ్రి, రవి కిషన్, గీతాంజలి కులకర్ణి, అరుణోదయ్ సింగ్, శర్దుల్ భరద్వాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.అలాగే నాగేష్ కుకునూర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'మిసెస్ దేశ్‌పాండే' వెబ్ సిరీస్‌లోనూ మాధురి నటిస్తున్నారు. ఈ సిరీస్‌లో ఆమె సీరియల్ కిల్లర్ పాత్రలో కనిపించనున్నారు. వరుస హత్యల మిస్టరీని ఛేదించే కథాంశంతో ఈ వెబ్ సిరీస్ రూపొందుతోంది.బాలీవుడ్‌లో అత్యుత్తమ నర్తకిగా గుర్తింపు పొందిన మాధురి దీక్షిత్ 70కి పైగా హిందీ చిత్రాల్లో నటించి, భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.



## ప్రముఖ నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ కన్నుమూత

చెన్నైలో గుండెపోటుతో తుదిశ్వాస 25కు పైగా చిత్రాలకు దర్శకత్వం 75కు పైగా సినిమాల్లో నటన తెలుగులోనూ నటించిన దిగ్గజం ఎంజీఆర్ వారసుడిగా ప్రశంసలు ఆఖ్రీ రాస్తాతో హిందీలోనూ గుర్తింపు ప్రముఖ తమిళ దర్శకుడు, నటుడు, కథా రచయిత కె. భాగ్యరాజ్ (73) గుండెపోటుతో చెన్నైలో కన్నుమూశారు. ఇటీవలే ఆయన నటి ఖుష్బూ కుమార్తె వివాహ వేడుకకు గోవాలో హాజరయ్యారు. ఇంతలోనే తుదిశ్వాస విడవడం సినీ పరిశ్రమను విషాదంలోకి నెట్టింది. తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో భాగ్యరాజ్‌గా జన్మించారు. ప్రముఖ దర్శకుడు భారతీరాజా వద్ద సహాయ దర్శకుడిగా సినీ ప్రయాణం ప్రారంభించారు. అనంతరం దర్శకుడిగా, కథా రచయితగా, నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మధ్యతరగతి కుటుంబాల జీవనశైలిని ప్రతిబింబించే కథలు, సహజమైన సంభాషణలు, భావోద్వేగాలతో కూడిన చిత్రాలకు ఆయన పెట్టింది పేరు. 1980, 1990 దశకాల్లో తమిళ సినీ పరిశ్రమలో అత్యంత విజయవంతమైన దర్శకుల్లో ఒకరిగా నిలిచారు. కెరీర్‌లో 25కు పైగా చిత్రాలకు భాగ్యరాజ్ దర్శకత్వం వహించారు. 75కిపైగా సినిమాల్లో నటించారు. ముందానై ముడిచ్చు, అంధా 7 నాట్కల్, డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్ వంటి చిత్రాలు ఆయనకు చిరస్థాయి గుర్తింపు తెచ్చాయి. తెలుగులోనూ కుబేర, 35, సీత, రెడ్ అలర్ట్, మేం వయసుకు వచ్చాం వంటి చిత్రాల్లో మెరిశారు. హిందీలోనూ ఆఖ్రీ రాస్తా చిత్రానికి దర్శకత్వం వహించారు. అమితాబ్ బచ్చన్, శ్రీదేవి, జయప్రద ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. భాగ్యరాజ్ సేవలను గుర్తించిన అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు ఎంజీఆర్.. సినీ రంగంలో తన వారసుడిగా ఆయనను ప్రశంసించడం విశేషం. భాగ్యరాజ్‌కు భార్య పూర్ణిమ భాగ్యరాజ్, కుమారుడు శంతను భాగ్యరాజ్, కుమార్తె శరణ్య ఉన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com